# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక




నిరంతర సాధనతో మంచి ఫలితాలు

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

2


| సంపుటి : 01 | సంచిక : 234 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 29 జూలై 2026 | పేజీలు : 4 |
|---|---|---|---|---|





## రైతులకు సాంకేతికతను చేరవేయడమే..

# రైతు నేస్తం లక్ష్యం

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న రైతునేస్తం

**హైదరాబాద్, జూలై 28 (మన చౌరాస్తా) :**

రైతు చెంతకు నూతన సాంకేతికతను చేరవేయడమే 'రైతు నేస్తం' లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు, శాస్త్రవేత్త, అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతు నేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతు నేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటి వరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతు నేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జూలైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10న ఈ ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.







## రూ. 3.5 కోట్ల విలువైన

# ప్రభుత్వ భూమి స్వాధీనం

- **కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ అధికారులు**

**చిల్పూర్, మన చౌరాస్తా :** చిల్పూర్ గ్రామంలో రూ. 3.5 కోట్లకు పైగా విలువగల ప్రభుత్వ భూమిని అక్రమ ఆక్రమణదారుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 229లోని సీలింగ్ భూముల్లో సుమారు 3 ఎకరాల 12 గుంటల భూమిని 2019 నుండి భూమి కన్స్ట్రక్షన్స్ (రెడీ మిక్స్ ప్లాంట్) వారు అక్రమంగా స్వాధీనం చేసుకుని ప్లాంట్ నిర్వహిస్తున్నారు. సదరు స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ కావడంతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు అధికారుల బృందం ఈ నెల 20న ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. తరిగొప్పుల చిన్న పెండ్యాల ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ. మూడున్నర కోట్లపైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడటంతో చిల్పూర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే తీవ్ర చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హెచ్చరించారు.



## రహదారుల అభివృద్ధికి

# సహకరించాలి

*కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం వినతి*

**న్యూఢిల్లీ, జూలై 28 (మన చౌరాస్తా) :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రహదారి మౌలిక వసతుల బలోపేతానికి సహకరించాలని కోరుతూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కరుణాపురం - ఎల్కతుర్తి మార్గాన్ని విస్తరించడంతో పాటు, యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి (NH163) పరిధిలోని నిడిగొండ, రఘునాథపల్లి, ఘన్‌పూర్ తదితర గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డు లింకులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే సీఆర్ఐఎఫ్ (2025-26) కింద ప్రతిపాదించిన నర్సంపేట-నందిగామ, భట్టుపల్లి-హంటర్ రోడ్ అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేయగా, ఈ వినతులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

# నిరంతర సాధనతోనే మెరుగైన ఫలితాలు

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** విద్యార్థులతో నిరంతర సాధన చేయిస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం ఆయన దేవరుప్పుల మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8, 10 తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. అనంతరం సాంఘిక శాస్త్రంలోని ఆర్కిటిక్, అంటార్కిటిక్ వలయాల గురించి విద్యార్థులకు సులభ శైలిలో వివరించారు. ఉపాధ్యాయులు ముందస్తు ప్రణాళికతో క్షుణ్ణంగా సిద్ధమై బోధిస్తేనే విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని సూచించారు. అకాడమిక్ ఫ్రేమ్‌వర్క్ పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని పాత ఇనుప సామగ్రి, తొలగించిన చెట్లను వేలం వేయాలని, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల కోసం మైదానంలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# స్కూల్ డ్రెస్‌లు త్వరగా అందించాలి

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులను త్వరితగతిన అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన దేవరుప్పుల మండలంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న యూనిఫాంల కుట్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కుట్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్.. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కుట్టు పూర్తయిన దుస్తులను పాఠశాలల వారీగా వర్గీకరించి వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా పొందుతున్న ఉపాధిని సద్వినియోగం చేసుకుంటూ సమయపాలన పాటించాలని మహిళా సంఘాలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ భాస్కర్, ఇతర అధికారులు, దర్జీలు పాల్గొన్నారు.











# అమరజీవి ఏ.సి.రెడ్డి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్**

**జనగామ, మన చౌరాస్తా :** దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందుండి నడిపించిన ప్రజానేత కామ్రేడ్ ఏ.సి.రెడ్డి (నర్సింహారెడ్డి) అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ తెలిపారు. మంగళవారం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ పార్క్ నుండి జూబ్లీ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ఏ.సి.రెడ్డి 35వ వర్ధంతి సభకు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎండి అబ్బాస్ మాట్లాడుతూ, రజాకార్ల దాడిలో తుడలో బుల్లెట్ దిగినా నైజాం సైన్యానికి ఎదురొడ్డి పోరాడిన త్యాగశీలి ఏ.సి.రెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్యేగా పనిచేసినా సొంత ఆస్తులు సంపాదించుకోకుండా, ఉద్యమానికే జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ వ్యక్తని గుర్తుచేసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరిస్తోందని మరియు కార్మిక, ఉపాధి హామీ చట్టాలను బలహీనపరుస్తోందని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్,బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, పి ఉపేందర్, మునిగెల రమేష్, చిట్యాల సోమన్న, ఎండి అజారుద్దీన్, శభానా, గంగాపురం మహేందర్, గుండెబోయిన రాజు, మిట్యా నాయక్, మండల కార్యదర్శులు మాచర్ల సారయ్య, దేవదానం, సుమా సీనియర్ నాయకులు ఎండి దస్తగిరి, పంపర మల్లేశం, లక్ష్మీనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుండె జబ్బుల నివారణకు అప్రమత్తత అవసరం : డా.నాగూర్

**జనగామ, మన చౌరాస్తా :** గుండె సంబంధిత వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండడము అనివార్యము అని గుండె జబ్బుల ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏ. నాగూర్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ ఆధ్వర్యంలో ఒమేగా హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యం తో ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లో మంగళవారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య పరీక్ష శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జనగామ చైర్మన్ లయన్ డా. డి. లవకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు లో డా నాగూర్ మాట్లాడుతూ షుగర్, బి పి వ్యాధి గ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని, ప్రతి ఒక్కరూ నిర్ణీత నియమం ప్రకారం నిద్రపోవాలని సూచించారు. ప్రతి మనిషికి గుండె సక్రమంగా పని చేసినపుడే ఆరోగ్యం గా ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. చైర్మన్ డా. లవకుమార్ రెడ్డి మాట్లాడుతూ సేవాభావం కలవారందరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులుగా చేరాలని ఆహ్వానించారు. తొలుత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వనమాల సోమయ్య స్వాగతం తెలిపారు. వందన సమర్పణ చేసిన ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్న పరశురాములు మాట్లాడుతూ వయో వృద్ధుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సెంటర్ లో వృద్ధుల సౌకర్యార్థం దిన పత్రికలు, టివి సౌకర్యం, గ్రంధాలయం, క్యారమ్, చెస్, టేబుల్ టెన్నీస్ సౌకర్యం కలదని ప్రతి రోజు ఉదయం 9 గం. ల నుండి సా 5 గం ల వరకు సెంటర్ తెరిచి ఉంటుందని తెలిపారు. ఈ రోజు శిబిరంలో పాల్గొని లబ్ధి పొందిన 92 మంది లబ్ది దారులు వారికి బి పి, ఇ సి జి, 2డి ఇకో పరీక్షలు నిర్వహించి సేవలందించిన ఒమేగా హాస్పిటల్స్ హైదరాబాద్ వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ శిబిరంలో డా. సుదీప్, పి ఆర్ ఓ ప్రవీణ్ కుమార్, శ్రవణ్, క్లబ్ కోశాధికారి బి . వీరయ్య, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు క్యాతరిన్, గోపయ్య, ప్రభాకర్ లయన్స్ నాయకులు నాగబండి రవీందర్, బచ్చు రమేశ్, ఎల్. శంకరలింగం, డా. జి. సీతారాం, మంగ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో పటిష్ట నిఘా వ్యవస్థ కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోంలతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ, భద్రత, పారిశుద్ధ్య పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా కెమెరాల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం వచ్చినా రికార్డింగ్ అయ్యేలా బ్యాకప్ సదుపాయాలు ఉండాలని, పర్యవేక్షణ కోసం అవసరమైన చోట వీడియో వాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు గ్రామాల్లో సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, ఈడీఎం గౌతమ్ రెడ్డి, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ విత్తనాలతో రైతులను ఆదుకోవాలి

- **రైతు వేదిక ముందు బీజేపీ ధర్నా**



**అక్కన్నపేట, మన చౌరాస్తా** : వానాకాలం సాగు సీజన్‌లో రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందించి ఆదుకోవాలని, రైతులకు సంబంధించిన ప్రభుత్వ సమాచారాన్ని ప్రతి గ్రామంలో డప్పు చాటింపు ద్వారా తెలియజేయాలని భారతీయ జనతా పార్టీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక ముందు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రామంచ మహేందర్ రెడ్డి నాయకత్వంలో రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను సకాలంలో, తగినంతగా అందుబాటులో ఉంచడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విత్తనాల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని, దీంతో సాగు వ్యయం పెరిగి రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని అన్నారు. నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి రైతుల ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు సంబంధించిన ప్రభుత్వ సమాచారం, సబ్సిడీ విత్తనాల పంపిణీ వివరాలు, వ్యవసాయ పథకాల సమాచారాన్ని కేవలం రైతు వేదికల ద్వారా లేదా వాట్సాప్ సమూహాల ద్వారా పంపించడం వల్ల ప్రతి రైతుకు చేరడం లేదని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక మంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, వాట్సాప్ వినియోగించలేకపోవడం వల్ల ప్రభుత్వ సమాచారం వారికి అందడం లేదని అన్నారు. అందువల్ల రైతులకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా ప్రకటించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం ద్వారా ప్రతి రైతుకు సకాలంలో సమాచారం చేరి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందరికీ సమానంగా లభిస్తాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ రైతుల తరఫున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తుందని రామంచ మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ ధర్నాలో మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, ఉపాధ్యక్షుడు జయదేశ్వరా చారి, కుంట స్వప్న, గంగుల కుమార్, సలేంధ్ర తిరుపతి, గిరిమల్ల రాజు, దార్న రాజు, కొండ్ల సంజీవరెడ్డి, బొంకూర్ రజనీకాంత్, కట్కూర్ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వేముగంటి తేజ, వడ్లూరి సృజన్ తదితరులు పాల్గొన్నారు.



# చింతల శోభారాణికి ఘన నివాళి


**జనగామ, మన చౌరాస్తా** : జనగామలోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నిర్వహించిన పట్టణ బీఆర్ఎస్ నాయకుడు చింతల రవీష్ రెడ్డి తల్లి చింతల శోభారాణి దశదిన కర్మ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చింతల శోభారాణి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం రవీష్ రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మైనార్టీ విద్యార్థి

**జనగామ టౌన్, మన చౌరాస్తా** : జనగామ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.కె అజీమ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిల్ బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జావలిన్ త్రో పోటీలో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ మురళీధర్ రావు, కళాశాల పీడీ జె. రాజు, అధ్యాపక బృందం విద్యార్థి అజీమ్‌ను అభినందించారు.



# ‘ఆటా’ వేడుకలకు ‘ఆరుట్ల’కు ఆహ్వానం



**జనగామ, మన చౌరాస్తా** : అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) అత్యంత వైభవంగా నిర్వహించనున్న 19వ ద్వివార్షిక ఆటా కాన్ఫరెన్స్ & యూత్ కన్వెన్షన్ వేడుకలకు బీజేపీ స్పోక్స్ పర్సన్ ఆరుట్ల దశమంత్ రెడ్డికి ఆహ్వానం లభించింది. ఈ కార్యక్రమం అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ నగరంలో ఉన్న బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్ లో జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు మూడు రోజుల పాటు జరగనుంది. ఈ వేడుకల్లో ఆయన ‘సెమినార్ పార్టిసిపెంట్’(Seminar Participant) గా హాజరుకానున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ మహాసభల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, యూత్ లీడర్‌షిప్ యాక్టివిటీస్, విద్యావ్యాపార సంబంధిత సెమినార్లు, జాబ్ ఫెయిర్లు సేవా కార్యక్రమాలు జరగనున్నాయి. 1990లో స్థాపించబడిన 'అమెరికన్ తెలుగు అసోసియేషన్' (ATA), అమెరికాలోని 50 రాష్ట్రాల్లో ఉన్న తెలుగు సంతతికి చెందిన ప్రజలకు ప్రతినిధిగా పనిచేస్తోంది. తెలుగు భాష, సంస్కృతి, పరంపరలను కాపాడుతూ.. విద్యా, సేవా రంగాల్లో ఎంతో కృషి చేస్తోంది. దశమంత రెడ్డి భాగస్వామ్యం తెలుగుఅమెరికన్ సమాజానికి, ముఖ్యంగా యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆటా అధ్యక్షులు జయనాథ్ చల్లా, కన్వీనర్ శ్రీధర్ బనాల తమ ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్‌తో బూత్ బలోపేతం

**అక్కన్నపేట, మన చౌరాస్తా** : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అక్కన్నపేట మండలంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మాజీ సెన్సార్ బోర్డు సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల రెడ్డి మండలంలోని పలు బూత్‌లను సందర్శించి కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్ఏ-2లు, బూత్ అధ్యక్షులు కీలక బాధ్యత వహించాలని అన్నారు. ఇప్పటికే 93 శాతానికి పైగా ఎన్యుమరేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా వంద శాతం పూర్తి చేసే వరకు ప్రతి బీఎల్ఏ-2, బూత్ అధ్యక్షుడు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఫైనల్ ఓటర్ల జాబితా విడుదలయ్యే వరకు ప్రతి ఓటరు వివరాలను నిశితంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మండల ఉపాధ్యక్షులు జగదీశ్ చారి, అర్జున్ నాయక్, మండల కార్యదర్శి కళ్యాణ్ విష్ణు, వివిధ మోర్చాల అధ్యక్షులు కుంట స్వప్న, సాలేంద్ర తిరుపతి, గిరిమల రాజు, గంగుల కుమార్, రవీంద్ర చారి, కొండే సంజీవరెడ్డి, కట్కూర్ ప్రభాకర్ రెడ్డి, బొంకూరి పోలో, రజినీకాంత్, దారణ రాజు, జిల్లా కనకయ్య, కనుకయ్య శ్రీనివాస్ రెడ్డి, వేముగంటి తేజ, వడ్లూరి సృజన్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముందు ఉప సర్పంచుల నిరసన




**జనగామ, మన చౌరాస్తా** : ఉప సర్పంచుల హక్కుల సాధన కోసం రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం పిలుపు మేరకు మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో ‘ఛలో కలెక్టరేట్’ కార్యక్రమం సక్సెస్ అయ్యింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఉప సర్పంచులు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి, తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవో రవికిరణ్‌కు అందజేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పండుగ హరీష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఉప సర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉప సర్పంచుల పేర్లను తప్పనిసరిగా చేర్చాలని, గ్రామపంచాయతీ తీర్మానాలపై సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు కూడా సంతకం చేసే అధికారాన్ని కల్పించాలని కోరారు. అదేవిధంగా మండల స్థాయి సర్వసభ్య సమావేశాలకు ఉప సర్పంచులను అధికారికంగా ఆహ్వానించడంతో పాటు, గ్రామపంచాయతీల్లో స్టాండింగ్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఉప సర్పంచ్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచుల హక్కులు పూర్తిస్థాయిలో సాధించే వరకు ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర శంకర్ నాయక్, అఖిల వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, నాగపురి కిషన్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిడుగు మహేష్, కార్యదర్శి పుప్పాల కరుణాకర్ కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, మండల అధ్యక్షులు ఎడ్ల బాలు, తిరుపతిరెడ్డి, ఆరూరి మాధవ్, నరేందర్, మూల కిరణ్ గౌడ్, చిలువేరు మహేందర్, గోవింద్ ఇసాక్, గాదె శాంత భాస్కర్, చింత నరేష్, వార్డ్ మెంబర్ల జిల్లా కన్వీనర్ కుంటి రాజు, ఉప సర్పంచులు సంపత్ రెడ్డి, కిరణ్ స్వామి, బక్క సరిత, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జిల్లా ఉప సర్పంచులందరికీ పండుగ హరీష్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.




# హారర్ థ్రిల్లర్ '418' విడుదల వాయిదా

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ '418' కోసం ఎదురుచూస్తున్న సినీ అభిమానులకు స్వల్ప నిరాశ ఎదురైంది. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన మైత్రీ మూవీ మేకర్స్, సినిమా విడుదలను వాయిదా వేస్తున్నామని తెలిపింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను మాత్రం వెల్లడించలేదు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని అభిమానులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం చిత్రబృందం విడుదల వాయిదాకు సంబంధించి ఎలాంటి అధికారిక కారణం చెప్పలేదు. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, విజువల్ ఎఫెక్ట్స్ , సాంకేతిక అంశాలు లేదా విడుదల ప్రణాళికలో మార్పుల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారా అనే చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. '418' ఒక ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార సామగ్రి సినిమాపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా సస్పెన్స్, భయానక అంశాలతో కథను తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. ఆమెతో పాటు చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ దర్శకుడు ప్రశాంత్ నీల్ మద్దతు. ఆయన ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉండటం వల్ల 418 పై ప్రారంభం నుంచే మంచి బజ్ ఏర్పడింది. ఆయన పేరు జత కావడంతో సినిమా స్థాయిపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందిస్తున్నారు. హారర్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవిస్తూ దర్శకుడు సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విడుదల వాయిదా పడినప్పటికీ, సినిమా విడుదలపై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మైత్రీ  మూవీ మేకర్స్ స్పష్టం చేసింది. దీంతో అభిమానులు ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**